క్లుప్తంగా

డిసెంబర్‌లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి



మాట్లాడుతున్న డీఈ నాగరాజు

శిరివెళ్ల: ఈ ఏడాది డిశంబర్ నాటి కల్లా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ నాగరాజు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షా సమావేశం జరిగింది. సచివాలయాల వారీగా ఇళ్ల పురోగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలానికి 1589 ఇళ్లు మంజూరు కాగా ఇంత వరకు 780 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. 66 ఇళ్ల నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయని వాటిని ఈ నెలలోనే పూర్తి చేయాలన్నారు. మిగిలిన 308 గృహాలు పునాది స్థాయిలో ఉన్నాయన్నారు. అవన్నీ పూర్తయితేనే కొత్తగా ఇళ్లు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఏఈ నాగశేఖర్, హౌసింగ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కుందూ వరద ఉధ్ధృతిని పరిశీలించిన ఎంపీ



కుందూ తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ

గోస్పాడు: మండలంలోని రాయపాడు–తేళ్లపురి గ్రామాల మధ్య కుందూ వరద ఉధ్ధృతిని గురువారం నంద్యాల ఎంపీ శబరి పరిశీలించారు. కుందూ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

కరపత్రాలు విడుదల

నంద్యాల(వ్యవసాయం): సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ సభ్యులు వినాయక చవితి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సముద్రాల సూరయ్య మాట్లాడుతూ గత 11 సంవత్సరాల నుంచి ఆలయంలో వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది శ్రీ పంచముఖ బృహచ్ఛద మహాగణపతిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ సభ్యులు శ్రీనివాసులు, సుబ్రమణ్యం, వసంత్, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటిపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చాగలమర్రి: ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని చింతలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రమేష్ విద్యార్థినీ విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇద్దరు విద్యార్థినులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వారికి త్వరలో కంటి అద్దాలు ఇస్తామన్నారు. అనంతరం ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నేత్రదానంపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సికిందర్‌బాషా, పీడీ శ్రీనాథ్‌రెడ్డి, సీహెచ్‌ఓ చంద్రకళ, ఏఎన్ఎం వేదమణి, ఆశా కార్యకర్తలు రమ్యక్రిష్ణ, వరలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ స్వాతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

45 మద్యం బాటిళ్లు స్వాధీనం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని అయ్యలూరుమెట్ట వద్ద గురువారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రమాదేవి అనే మహిళను తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు. సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా రమాదేవి వద్ద 45 మద్యం బాటిళ్లు లభించాయని ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పట్టుబడిన ఆటో

చాగలమర్రి: ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా గురువారం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని చిన్నవంగలి గ్రామానికి వెళ్లే రస్తాలో ఉన్న నల్లాలమ్మ గుడి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పెద్దవంగలి గ్రామం వైపు నుంచి ఆటో వచ్చింది. దానిని ఆపి చూడగా అందులో 5.6 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉంది. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి ఆటో డ్రైవర్ గారెల్ల రవిని విచారించగా చాగలమర్రికి చెందిన గంగుల భాస్కర్‌తో కలిసి చుట్టుపక్కల గ్రామాల్లో బియ్యాన్ని సేకరించినట్లు తెలిపాడని ఇన్‌చార్జ్ ఎస్ఐ హరిప్రసాద్ వెల్లడించారు.





నంద్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం, చాగలమర్రి జెడ్పీ హైస్కూల్‌లో..



భాగ్యనగరం జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎంను సన్మానిస్తున్న టీచర్లు



ఉయ్యాలవాడలో హాస్టల్ వార్డెన్ సురేష్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

మార్గదర్శకులు..గురువులు

● ఉపాధ్యాయ దినోత్సవంలో వక్తలు ● నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఘనంగా వేడుకలు ● ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఆర్ఏఆర్ఎస్‌లో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్)/(న్యూటౌన్)/(వ్యవసాయం): విద్యాబుద్ధులు నేర్పించి జీవన వికాసానికి కృషి చేసే ఉపాధ్యాయులు మార్గదర్శకులు అని వక్తలు కొనియాడారు. గురువారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.

- నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఏడీఆర్ జాన్సన్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- నంద్యాల పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు చాబోలు డేవిడ్‌ను ఘనంగా సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈకార్యక్రమంలో రిటైర్డు ప్రధానోపాధ్యాయురాలు పద్మిణి, ప్రధానోపాధ్యాయుడు దేవదాసు, ఉపాధ్యాయులు రేణుక, శివలక్ష్మి, నిర్మల, సోమన్న, మేరమ్మ, కాళీంబీ పాల్గొన్నారు.
- నంద్యాల పట్టణంలోని సమతా విద్యానికేతన్‌లో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ బాలచంద్రుడు, రమాదేవి, ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం జీవలత,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శారదా విద్యాపీఠంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల టీచర్లు నారాయణ, సుజాత, నజీమాబేగం, మద్దిలేటి, షేక్‌బేగంను ఘనంగా సత్కరించారు.
- గోస్పాడు మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న యాళ్లూరు హైస్కూల్ హెచ్‌ఎం శివనాగేంద్రుడు, గోస్పాడు జూనియర్ కళాశాల లెక్చరర్ నందకుమార్, పీజీటీ ఉదయ్‌కుమార్‌బాబు, దీబగుంట్ల హైస్కూల్ పీడీ విశ్వనాథ్, జిల్లెల్ల ఎంపీపీ స్కూల్, ఎస్జీటీ శైలజలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.
- విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులనని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు శబరి అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చైర్మన్ దస్తగిరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవికృష్ణ, ఫిరోజ్, విద్యాసంస్థల డైరెక్టర్ మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- ఉయ్యాలవాడ : గురువులు సమాజ నిర్మాతలు అని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు,ఎంఈఓలు అనురాధ, వీర ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మోడల్ స్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువ కప్పి, పూలమాల వేసి సన్మానించారు. బీసీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారి సురేష్‌ను మోడల్‌స్కూల్ అధ్యాపక బృందం సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.
- రుద్రవరం: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, టీచర్లు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.
- శిరివెళ్ల: మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురు పూజోత్సవ ప్రాముఖ్యతను హెచ్‌ఎంలు విద్యార్థులకు తెలిపారు.
- దొర్నిపాడు: మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ పరంగా సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదని దాన్ని ప్రతి ఉపాధ్యాయుడు కాపాడుకోవాలని మండల విద్యాధికారి రామచంద్రయ్య అన్నారు. భాగ్యనగరం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఆదిలక్ష్మమ్మను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ అడుగు జాడల్లో నడవాలి

చాగలమర్రి: ఉపాధ్యాయ వృత్తికి గుర్తింపు, గౌరవం తీసుకొచ్చిన భారత మాజీ రాష్ట్రపతి, దివంగత సర్వేపల్లి రాధాకృష్ణన్ అడుగు జాడల్లో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు నడవాలని చాగలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎం.మహబుబ్‌బాషా అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు కలిసి పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించారు.

పంట నమోదు వేగవంతం చేయండి



యర్రగుంట్లలో మినుము పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

శిరివెళ్ల: పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. గురువారం గోవిందపల్లె, యర్రగుంట్లలో రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. సేవా కేంద్రాల వారీగా పంట నమోదు, ఈకేవైసీల పురోగతిని ఆరా తీశారు. ఖరీఫ్‌లో సాగయిన ప్రతి పంటను నమోదు చేయాలని ఆదేశించారు. మండలంలో 95 శాతం వరి పంట సాగవుతుందని, మినుము, మొక్కజొన్న, పెసర పంటల సాగు కూడా జరుగుతుందని ఏఓ సుధాకర్ డీఏఓతో అన్నారు. మండలంలో 20 వేల ఎకరాలకు గాను 13,543 ఎకరాల్లో సాగయిన పంటల నమోదు పూర్తి అయిందని ఏఓ తెలిపారు. 412 మందిలతో ఈకేవైసీ చేయించామని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది , వీఆర్వోల సమన్వయంతో ఈ నెల 15లోగా కార్యక్రమంను పూర్తి చేయాలని డీఏఓ ఆదేశించారు. అనంతరం పొలాలలకు వెళ్లి పంట నమోదు కార్యక్రమం, వరి, మినుము పంటల సాగును పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల వర్తింపు

నంద్యాల(అర్బన్): ఈ పంట నమోదు చేయించుకున్న రైతులకు పంట నష్టపరిహారం, ఇన్సురెన్స్, మద్దతు ధర తదితరవి లభిస్తాయని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. గురువారం మండలంలోని బిల్లలాపురం, పెద్దకొట్టాల గ్రామంలోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి ఈ పంట నమోదు, ఈకేవైసీ కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఈఓలు ముక్తార్‌బాషా, రవికుమార్, వీఏఏలు శివనాయక్, అనిల్‌కుమార్, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ఉయ్యాలవాడ : రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ఉద్యాన పంటలకు సంబంధించి ఈ నెల 15వ తేదీలోగా ఈ క్రాప్ చేయించుకోవాలని కోవెలకుంట్ల ఉద్యానవన శాఖ అధికారిణి ధరిణి సూచించారు. గురువారం మండలంలోని ఇంజేడు, ఉయ్యాలవాడ, అల్లూరు గ్రామాల్లో ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న పండ్ల తోటలు, మిరప పంటను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంటల్లో నిలిచిన వర్షం నీటిని బయటకు పంపిచేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వరద నీరు పూర్తిగా తగ్గుముఖం పట్టిన తరువాత పంట నష్ట అంచనా వేస్తామన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

శిరివెళ్ల: వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు పోలీసు అనుమతి తప్పని సరి అని ఎస్ఐ చిన్న పీరయ్య అన్నారు. గురువారం మండపాల ఏర్పాటు, పండగ నిర్వహణ, వినాయక విగ్రహాల నిమజ్జనంపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రాత్రి వేళలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ సిబ్బంది కూడా నిఘా పెడతారన్నారు. ప్రతి మండపం వద్ద రాత్రి 10 గంటల కల్లా మైక్‌లు బంద్ చేయాలని, నిమజ్జనం రోజున మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాయంత్రం 6 గంటల్లోగా వాగులు, కాల్వల్లో నిమజ్జనం చేయాలన్నారు. విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలను మద్యం సేవించిన వారు నడవరాదన్నారు. ట్రాక్టర్లను కండీషన్‌లో ఉంచాలన్నారు. చిన్న పిల్లలను నిమజ్జనం వద్దకు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యామా గుర్రప్ప, మాజీ సర్పంచు బీసీ ఖాజా ఉశేని, ఫిదా, ముల్లా అన్వర్‌బాషా, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. గురువారం నరసింహయ్య భవన్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో ప్లీనరీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా నాగరాజు హాజరై మాట్లాడుతూ జిల్లాలోని ఆదర్శ, గురుకుల, కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో పేద విద్యార్థులకు సీట్లు రాక ప్రైవేటు హాస్టల్‌లో లక్షలాది రూపాయలు ఫీజులు కట్టి విద్యను అభ్యసిస్తున్నారన్నారు. విద్యార్థుల ఆర్థిక పరిస్థితి గురించి ప్రజా ప్రతినిధులు ఆలోచించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చి విద్యను ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ప్రతి విద్యార్థి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు దినేష్, ఎంఆర్ నాయక్, అశోక, రాజా, హరివర్ధన్, డీవైఎఫ్ఐ నాయకులు మధుశేఖర్ పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

గోస్పాడు: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంట్రాక్ట్ లెక్చరర్ల ఆర్జేడీ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అబ్దుల్‌జబ్బార్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులను రెగ్యులర్ చేయాలన్నారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం



సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ రుకియాభాను తెలిపారు. ఆరోగ్యవంత సమాజ నిర్మాణానికి కార్యకర్తలు తమవంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేవనగర్‌లోని సంక్షేమ వసతి గృహంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆహారంలో తీసుకోవాల్సిన పోషక పదార్థాల గురించి వివరించారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ నిర్మల, సీడీపీఓ చంద్రకళల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జైనాబీ, సూపర్‌వైజర్లు నజీరా, సుజాత, అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

చాగలమర్రి: క్రమం తప్పకుండా పోషకామారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుశీలమ్మ అన్నారు. ఈ నెల 1వ నుంచి 30వ తేది వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం చాగలమర్రిలోని 17వ అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రీ స్కూల్ ప్రాముఖ్యత గురించి తెలియపరచటానికి ఈసీసీఈ కార్నర్ ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా వినాయక చవితి బొమ్మల మాస్కులు ధరించి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.సుజాత, కె.ఇందుమతి, ఎం.మహబూబ్‌చాన్, పి.రహమత్, టి.మహబూబ్‌బీ పాల్గొన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించుకోండి

రుద్రవరం:వినాయక చవితి పండుగను ప్రశాంతగా నిర్వహించుకోవాలని ఎస్ఐ వరప్రసాదు కమిటీ సభ్యులకు సూచించారు. రుద్రవరంలోని పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ఆయన వినాయక విగ్రహ కమిటీ సభ్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. మండపాలు, విగ్రహాల కొలువుకు అనుమతులు తీసుకోవాలన్నా రు. అలాగే నిమజ్జనం రోజు శాంతి భద్రలకు విఘాతం కలగకుండా ప్రశాంతగా చేసుకోవలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అల్లర్లు లేకుండా వేడుకలు

దొర్నిపాడు: ఈనెల 7న వినాయకచవితి ఉత్సవాలు అల్లర్లకు తావ్వులేకుండా ప్రశాంతంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలను తహసీల్దార్ సుభద్ర అదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె వినాయక చవితి ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. వినాయక మంటపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ సుప్రియ, ఏఎస్ఐ రంగయ్య, సీనియర్ అసిస్టెంట్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

భక్తులారా వస్తున్నా..!

- ఊపందుకున్న వినాయక విగ్రహాల అమ్మకాలు
- ఈనెల 7న వాడవాడల్లో కొలువుదీరనున్న గణనాథులు
- మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని కాపాడుదామంటున్న మేధావులు

నంద్యాల(వ్యవసాయం)/గోస్పాడు: దేవుళ్లలో వినాయకుడికి ప్రత్యేక స్థానం ఉంది. అందుకే వినాయక చవితి పిల్లలకు, పెద్దలకు ఇష్టమైన పండుగ. ఈనెల 7నుంచి పండుగ ప్రారంభం కానున్న నేపథ్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. దీంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా వినాయక విగ్రహాలకు డిమాండ్ పెరిగింది. జిల్లాలో ఈ సారి దాదాపు 1500 విగ్రహాలు ఏర్పాటు కానున్నాయి. నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో వ్యాపారులు గణేష్ ఉత్సవ విగ్రహాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. కొందరు వ్యాపారులు కోల్‌కతా, హైదరాబాద్, అనంతపురం జిల్లా గుంతకల్లు సమీపం నుంచి విగ్రహాలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. డిమాండ్ పెరగడంతో ఉత్సవ కమిటీల నిర్వాహకులు ముందుగానే వినాయక విగ్రహాలను బుకింగ్ చేసుకుంటున్నారు. ఒక్కో విగ్రహం సైజ్, ప్రత్యేకతను బట్టి రూ.5వేల నుంచి రూ.70 వేల వరకు ధర పలుకుతున్నాయి.

మట్టి విగ్రహాలే ముద్దు

వినాయకుడు పుట్టింది పార్వతీదేవి మేని నలుగు మట్టి నుంచి అని పురాణాలు చెబుతాయి. గణనాథుడిని పూజించే 21 రకాల పూజాపత్రాలు కూడా మట్టి నుంచే ఉత్పత్తి అవుతాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన గణనాథులను నిమజ్జనం చేయడంతో కాలువలు, నదుల్లో నీళ్లు కలుషితమవుతాయి. ఇవి నీటిలో కరుగవు. ఈ నీళ్లు ఎవరైనా తాగితే అనారోగ్యాల బారిన పడుతారు. అదే మట్టి గణనాథులైతే చెరువుల్లో దొరికే బంక మట్టితో తయారవుతాయి. ఇవి మట్టి నీళ్లల్లో సులువుగా కరుగుతాయి. పర్యావరణ కాలుష్యానికి అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో మట్టివినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని వేదపండితులు, పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు.



నంద్యాలలో విగ్రహాలను కొనుగోలు చేస్తున్న దృశ్యం



మట్టి వినాయకులను తీర్చిదిద్దుతున్న కళాకారుడు

పర్యావరణాన్ని కాపాడుదాం



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను వాడకుండా మట్టితో తయారు చేసిన వాటిని ఉపయోగించాలి. పూజా ద్రవ్యాలను సైతం ప్రకృతిసిద్ధమైన వాటిని వాడాలి. దీని వల్ల పర్యావరణానికి మేలు చేసిన వారు అవుతారు. జలకాలుష్యం కాకుండా జలజీవరాసులు రక్షింపబడుతాయి.
–రామకృష్ణారెడ్డి, శ్రీ గణేష్ కేంద్ర సమితి గౌరవాధ్యక్షుడు

మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి



వినాయక విగ్రహ మండపాల వద్ద విద్యుద్దీపాలంకరణ, దీపారాధన తదితర విషయాల్లో నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి. ఇతరులకు ఇబ్బంది కలిగేలా డీజేలు, భారీ సౌండ్‌సిస్టమ్‌లను ఉపయోగించరాదు. మత్తు పదార్థాలు సేవించి నిమజ్జనంలో పాల్గొనరాదు.
–అదిరాజ్‌సింగ్ రాణా, జిల్లా ఎస్పీ, నంద్యాల